క్లుప్తంగా

కొండెంగ రాకతో కోతులు పరార్



నడికూడ : మండల కేంద్రంలో కొండెంగ రాకతో కోతులు పరారౌతున్నాయని సర్పంచ్ ఊర రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోతుల బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం కోసం కొండెంగను తిప్పుతున్నట్టు తెలిపారు. మండల కేంద్రంలో కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొరబడి సరకులు ఎత్తుకెళ్తుండడమే కాకుండా జనం మీదకు దాడి చేస్తుండడమే కాకుండా రైతుల పంట పొలాల వద్ద కూడా ఇబ్బందులు ఎదురౌతుండడంతో రూ.20 వేలు వెచ్చించి కొండెంగను తీసుకొచ్చినట్టు తెలిపారు. కోతుల బెడద ఎక్కడ ఉంటే అక్కడకు కొండెంగను పంపిస్తున్నామని చెప్పారు. కొండెంగకు ఆహారం, ఇతర ఖర్చుల కింద నెలకు రూ.3–4 వేలు ఖర్చౌతున్నట్టు వివరించారు.

వైఎస్సార్‌టీపీ యూత్ మండల అధ్యక్షుడిగా అనిల్



నడికూడ : వైఎస్సార్ టీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా మండలంలోని కంఠాత్మకూర్‌కు చెందిన అనిల్‌ను జిల్లా అధ్యక్షుడు జిన్నారపు మహేష్ నియమించారు. ఈ మేరకు అనిల్‌కు నియామక ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో అనిల్ బుధవారం మాట్లాడారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆదేశాలకు మేరకు జిల్లా అధ్యక్షుడు మహేష్ తనను నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, యువజన సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణను వినియోగించుకోండి



డ్రైవింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

శాయంపేట : బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గండ్ర గౌతంరెడ్డి ఏర్పాటు చేసిన జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణను యువత వినియోగించుకోవాలని ఎంపీటీసీ గొట్టిముక్కల స్వాతి విష్ణు కోరారు. మండలంలోని తహరాపూర్ గ్రామంలో ఆ ట్రస్ట్ విన్ మోటార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. డ్రైవింగ్‌లో శిక్షణ పొందితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ, వార్డు సభ్యుడు కొమ్ముల సంతోష్, ట్రస్ట్ సభ్యులు బొజ్జం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద రేపు (ఈనెల 10న) దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహిస్తామని ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ బాబునాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన నూరు శాతం వైకల్యమున్న అంధులు, మూగ, చెవిటి బాధితులే కాకుండా 40 శాతానికిపైగా శారీరక వైకల్యమున్న దివ్యాంగులు సదరం ధృవీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు, ఫొటో వెంట తీసుకొని ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళాకు వచ్చి బస్‌పాస్ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

ఈడీ నోటీసులు బీజేపీ వ్యూహం!

హన్మకొండ: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కుట్రలో భాగంగానే ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవితకు ఈడీ నుంచి నోటీసులు అందాయని భారత్ జాగృతి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితకు రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ నోటీసులు పంపారని తెలిపారు. బీజేపీ బెదిరింపులకు భయపడబోమని, పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు. ఈనెల 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న ఒకరోజు దీక్షను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖిలా వరంగల్ : బైక్‌ను స్వచ్ఛభారత్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన లేబర్‌కాలనీ 100 ఫీట్ల రోడ్డు సమీపంలోని టీ పాయింట్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లేబర్‌కాలనీ ప్రాంతానికి చెందిన దుపాకి శ్రీనివాస్ ఈనెల 2న బైక్‌పై వస్తుండగా బల్దియా స్వచ్ఛభారత్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. అతడి కొడుకు విశ్వాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

వేడుకగా మహిళా దినోత్సవం



పరకాల : కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న సీఐ, ఇతరులు



ఎల్కతుర్తి : పెంచికలపేటలో..



ఆత్మకూరు : ఎంపీపీని సన్మానిస్తున్న వైద్యసిబ్బంది



శాయంపేట : జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పరకాల : పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అశ్వినిని సీఐ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు.

ఎల్కతుర్తి : మండలంలోని ఎల్కతుర్తి, పెంచికలపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ సామెల జమున కేక్ కట్ చేశారు. మహిళా సంఘాల నాయకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు మామిడి ఉమ, తిరుమల, రజిత, మౌనిక, శోభ, వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులను సన్మానించారు.

ఐనవోలు : స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీపీ మధుమతిని, మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్నేని మధమతి మాట్లాడారు. సీఎం కేసీఆర్ మహిళలకు పెద్దపీట వేసి బీఆర్ఎస్ పార్టీలో, రాష్ట్ర ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తున్నట్టు తెలిపారు. మహిళా ఉద్యోగులను ఎంపీపీ శాలువాలతో సత్కరించారు.

ఈ–టెక్నో స్కూల్‌లో..

మండలంలోని పున్నేల్ క్రాస్‌లోని ఏకశిల ఈ–టెక్నో స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల



ఐనవోలు : మాట్లాడుతున్న ఎంపీపీ మధుమతి



ఐనవోలు : ఈ–టెక్నో స్కూల్‌లో..



భీమదేవరపల్లి : సన్మానిస్తున్న సర్పంచ్, ఇతరులు



దామెర : డిస్నీల్యాండ్ స్కూల్‌లో..

పరిపాలన అధికారి (ఏఓ) మహ్మద్ బాబా మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మహిళలను గౌరవించడమే కాకుండా పూజించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయినులకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.రవికిరణ్, ఉపాధ్యాయులు అమర్‌నాథ్, అరుణ్‌కుమార్, కుమారస్వామి, రాజ పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో మహిళా కార్మికులను, వార్డు సభ్యులను, అంగన్‌వాడీలను, ఏఎన్ఎంలను సర్పంచ్ మాడ్గుల కొంరయ్య, కార్యదర్శి జంగం పూర్ణచందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్ మాట్లాడారు. అలాగే సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డిని యువ నాయకుడు గజ్జెల సురేష్ ఆధ్వర్యంలో సత్కరించారు.

దామెర : మండలంలోని ఓగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ శోభారాణి కేక్ కట్‌చేసి విద్యార్థులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్లు డి.విజయలక్ష్మీ, డి.కావ్య, డి.మీన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న సొసైటీ సభ్యురాలు



శాయంపేట : కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు



కమలాపూర్ : కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాణి

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలోని సొసైటీ ఆఫ్ గెత్సేమనే సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. సభ్యులు మాట్లాడారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో కరుణ్మయి, కరుణ, దివ్య, నిర్మల, హర్ష, రీమా పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి కేక్ కట్ చేసి మాట్లాడారు. సాధికారిత సాధించినప్పుడే మహిళల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మహిళలు హక్కులను వినియోగించుకోవాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు

వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, సర్పంచ్ గోలి మాధురి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు గుర్రం రవీందర్, తోట కుమారస్వామి, నర్ర కుమారస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సామల మధుసూదన్, నాయకులు మారపల్లి మోహన్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంలో ఉపాధి హామీ పనుల ప్రదేశం వద్ద, శనిగరంలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో, కమలాపూర్‌లోని విశ్వభారతి హైస్కూల్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంపీపీ తడక రాణి సహా మహిళలను, విశ్వభారతి హైస్కూల్ టీచర్లను సత్కరించారు. సర్పంచ్ ఇనుగాల కిరణ్మయి విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ సోగల రాజు, బ్యాంకు మేనేజర్ భూక్యా రమేష్, ఏబీఎం సురేష్, సిబ్బంది దామోదర్, బీసీ కత్తి రమేష్, సీసీ శ్రీదేవి, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఇంజపురి మధుబాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : సీఎం కేసీఆర్ మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గండి రాజమౌళి, ఉపాధ్యక్షుడు ఐరబోయిన రాజు, కార్యదర్శి మదార్ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం చైర్మన్, ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలతోపాటు డైరెక్టర్లను గండ్ర దంపతులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించడంతోపాటు పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మత్స్యకార్మికుల జీవనోపాధి కోసం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యవర్గం సమన్వయంతో పని చేసి మత్స్యకార్మికుల సంక్షేమానికి బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, కొప్పుల, గోవిందాపూర్ సర్పంచ్‌లు గోలి మాధురి మహేందర్‌రెడ్డి, బైరి శ్రీనివాస్, ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు సామల మధుసుధన్, మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, నాయకులు గుర్రం రవీందర్, నర్ర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గంతో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

ఉన్నత స్థాయికి ఎదగాలి



కమలాపూర్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ బొలుమల్ల సంజీవ్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్‌ను నిర్దేశించుకోవాలని చెప్పారు. ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాల్లో హైస్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఇంజపురి మధుబాబు, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పని చేస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన 25 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల విలువైన చెక్కులను హనుమకొండలోని నివాసంలో ఆయన బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారం చేపట్టినప్పటి నుంచి పేదల సంక్షేమమే పరమావధిగా అనేక పథకాలకు, అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో పేదలు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే ఆర్థికసాయం అందిస్తున్నట్టు తెలిపారు. సమైక్య పాలనలో రాష్ట్రం విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, వ్యవసాయ, తదితర అన్ని రంగాల్లో వెనుకబడిందని చెప్పారు. సీఎం కేసీఆర్ రైతులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి క్రియాశీలకంగా పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

యాజమాన్య పద్ధతిలో పశుపోషణ మేలు

- మామునూర్ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

ధర్మసాగర్ : పశుపోషణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలని మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త రాజన్న తెలిపారు. క్షేత్ర సందర్శనలో భాగంగా మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలో బుధవారం వివిధ పశుపోషణ క్షేత్రాలను ఆయన ఆధ్వర్యంలో బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడారు. పశువులను ఎండ తాకిడి నుంచి కాపాడేలా షెడ్డు చుట్టూ నీటితో తడిపిన గోనె సంచులు కట్టాలని సూచించారు. పాడిరైతులు వేసవి కాలంలో పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువులకు చల్లటి నీటిని రోజుకు కనీసం 3–4 సార్లు అందించడంతోపాటు ఉదయం, రాత్రి వేళల్లో ఎండు గడ్డి అందించాలని తెలిపారు. అనంతరం వివిధ పంట క్షేత్రాలను సందర్శించారు. ప్రస్తుతం వరి పైరు పిలకలు వేసే దశ నుంచి పొట్ట దశలో ఉన్న క్రమంలో కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణ కోసం 'క్లోరంట్ర నిలిప్రోలు' అనే రసాయనిక మందుని లీటర్ నీటికి 0.3 మిల్లీలీటర్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. తద్వారా తెల్లకంకి ఉధృతిని తగ్గించొచ్చని చెప్పారు. వరి పొలాలను 3–4 రోజులకోసారి ఆరబెడితే దోమ ఉధృతి నివారించొచ్చని తెలిపారు. వంకాయ పంటలో కాయతొలుచు పురుగు ఉధృతి నివారణ కోసం 'ఏమామెక్టిన్ బెంజోజెట్' రసాయనాన్ని లీటర్ నీటిలో 0.3 మిల్లీలీటర్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజు, పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వాలి

నయీంనగర్: జర్నలిస్టులకు నివేశన స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ కోరారు. ఈమేరకు మంత్రి కేటీఆర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే వరంగల్ వస్తానని, అక్కడే చర్చించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారని, అప్పటివరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో టచ్‌లో ఉండాలన్నారని నాగరాజు తెలిపారు.

నిరంతర అధ్యయనంతోనే లక్ష్యసాధన

- నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్

ధర్మసాగర్ : నిరంతర శ్రమ, అధ్యయనంతోనే లక్ష్య సాధన సిద్ధిస్తుందని నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రమించడాన్ని జీవితాన్ని ప్రేమించడంగా అభివర్ణించారు. విజయానికి దగ్గరి దారులుండవని స్పష్టం చేశారు. విద్యార్థులు నిరంతరం శ్రమించాలని సూచించారు. తద్వారానే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలరని తెలిపారు. నిట్ జేఈఈ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తోడ్పాటు అందిస్తానని భరోసా ఇచ్చారు. నిట్ ద్వారా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ అనతికాలంలోనే విద్యార్థులకు అనేక సౌకర్యాలు సమకూర్చామని చెప్పారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కళాశాల గౌరవాన్ని, ప్రతిష్ఠను పెంచాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కరుణాకర్‌రెడ్డి, అశోక్ కుమార్, జ్యోతి, బాబురావు, వెంకట్, రాములు, సదానందం, గణేష్, నిర్మల, హరిప్రసాద్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్

అనుమతి రద్దు చేయాలి



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలో ఆజంజాహి మిల్లు వర్కర్స్ యూనియన్ కార్యాలయానికి (బిల్డింగ్) సంబంధించిన స్థలంలో అనుమతి లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను ఆయన నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఆజంజాహి మిల్లు ఏర్పడిన తరువాత కార్మికుల కోసం యూనియన్ కార్యాలయం నిర్మాణం జరిగిందని, దానికి ఇటీవల కొంతమంది దురాక్రమణదారులు నకిలీ పత్రాలు సృష్టించి ఓ వ్యాపారికి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ, గద్దల జంజీవ, మైదం శ్యామ్ తదితరులు ఉన్నారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

ఆత్మకూరు : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నోజు శ్రీనివాసచారి తెలిపారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం, లక్ష్యం, గతంలో టీడీపీ హయాంలో అందించిన సంక్షేమ పథకాలు, తదితరాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా పోరాడతామని చెప్పారు. టీడీపీ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి శ్రీశైలం, నాయకులు రేగుల సదానందం, కంచరకట్ల విజయ్‌పాల్‌రెడ్డి, ఎక్కలదేవి రమేష్, ఎలుక సమ్మయ్య, సిద్దోజు రాజమౌళి, జనగాం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న శ్రీనివాసచారి

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతోనే గ్రామంలో అభివృద్ధి జరుగుతోందని కొప్పుల సర్పంచ్ గోలి మాధురి మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో రోడ్డు సదుపాయం కల్పించేలా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవ తీసుకుని రూ.20 లక్షలు మంజూరు చేయించడంతో పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలకు అవసరమైన తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీ, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవ చూపిస్తున్నట్టు తెలిపారు. ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ అట్ల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామల మధుసూదన్, మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, వార్డు సభ్యులు గుర్రం సుధాకర్, మామిడి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

పెరిక కుల సభ్యుల సంక్షేమానికి కృషి

ఖిలా వరంగల్: పెరిక కుల సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన గౌరవ అధ్యక్షుడు దిడ్డి నరేందర్, అధ్యక్షుడు వడ్డె రవీందర్ అన్నారు. వరంగల్‌లో కన్వీనర్ దిడ్డి నరేందర్, కోకన్వీనర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన గ్రేటర్ వరంగల్ పెరిక కుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దిడ్డి నరేందర్, అధ్యక్షుడిగా వడ్డె రవీందర్, ప్రధాన కార్యదర్శిగా దిడ్డి కుమారస్వామి, ఆర్థిక కార్యదర్శిగా చుంచు కట్టమల్లు, ఉపాధ్యక్షులుగా శ్రీరాం రవి, చింతం యాదగిరి, బుద్దే సురేందర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీరాం రాజేశ్వర్‌రావు, సంగని జగదీశ్వర్, ముద్దసాని శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఏసీరెడ్డి రమేష్, సందసాని నరేష్, ప్రచార కార్యదర్శిగా పూజారి జితేందర్, సంకతాల సంజీవ, పోతరాజు రాజేశ్వర్‌రావు, కారుకూరి భాస్కర్, గజ్జల నరేందర్, కార్యవర్గ సభ్యులుగా బొలుగొడ్డు శ్రీనివాస్, చింతల క్రాంతికుమార్, కట్ల సదయ్య, అప్పని కృష్ణ, బేరే శంకర్, గడ్డం శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా మేడిశెట్టి రాములు, సంగని మల్లేశ్వర్, డాక్టర్ తిప్పని రమేష్, చింతం లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, ఎంబాడి రవీందర్, కక్కె సారయ్య, శ్యాంకిరణ్, తదితరులు ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్‌లో మైనార్టీలకు అవమానం



మాట్లాడుతున్న అయూబ్

రామన్నపేట : ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, గ్రంథాయల చైర్మన్ అజీజ్‌ఖాన్ పేర్లు లేకపోవడం మైనార్టీలను కించపరచడమేనని కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు అయూబ్ విమర్శించారు. మండిబజార్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింల పక్షపాతి కేసీఆర్ అని పేర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులు.. మైనార్టీలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రజియా పాషా, తుమ్మల్ తదితరులు పాల్గొన్నారు.